శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త





## వి.ఆర్ కాలేజీలో బిఈడిని పునఃప్రారంభించండి

కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఎంపీ వేమిరెడ్డి వినతి
2024 - 25 విద్యా సంవత్సరం నుంచే బి ఎడ్ కు అనుమతులు మంజూరు చేయండి
ఎంపీ వినతికి సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 5, ప్రభాతవార్త** జిల్లాలో ప్రతిష్టాత్మకమైన నెల్లూరులోని వి.ఆర్ కాలేజీలో 2024 - 25 విద్యా సంవత్సరం నుంచి బిఈడ్‌ను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కి విన్నవించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కార్యాలయంలో ఆయన్ను కలిసిన ఎంపీగారు.. ఇందుకు సంబంధించి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం దీనిపై సుధీర్ఘంగా కేంద్రమంత్రికి వివరించారు. ఈ విద్యా సంస్థను 2018లో భారత సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, విఆర్‌నిర్వహణ కమిటీ స్థానంలో జిల్లా జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ప్రత్యేక అధికారిగా నియమించబడ్డారన్నారు. నిర్వహణలో మార్పులు, కరోనా కారణంగా 2022 - 23 విద్యా సంవత్సరానికి రీజనల్ డైరెక్టర్, ఢిల్లీ, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఈ), న్యూఢిల్లీ జారీ చేసిన షోకాజ్ నోటీసులకు స్పందించలేకపోయారన్నారు. దాంతో ఎస్ఆర్‌సి (సౌతర్న్ రీజినల్ కమిటీ) ఎన్‌సిటిఈ బిఈడ్‌లో అడ్మిషన్లకు అనుమతులు ఇవ్వలేదన్నారు. విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సదరు అనుమతులు ఇచ్చేలా ఎస్ఆర్‌సి, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఈ) అధికారులకు అవసరమైన సూచనలను జారీ చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. 2024 – 25 నుంచి బిఈడ్ కోర్సు ప్రారంభం అయితే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి తప్పకుండా తగిన చర్యలు తీసుకుని బిఈడ్ ప్రారంభం అయ్యేలా చూస్తామని స్పష్టం చేశారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, డిసెంబర్5ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 10,388 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 72.27టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 150, ఎన్ఎఫ్‌సికి 40, పెన్నా డెల్టాకు 50, కండలేరు వరద కాలువకు2000 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.792మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## కావలిలో రియల్టర్లు ఆక్రమించిన 120 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్




**కావలి, డిసెంబర్ 5 ప్రభాతవార్త** కావలి మున్సిపాలిటి పరిధిలో రియల్టర్లు ఆక్రమించిన ప్రభుత్వభూమి 120 ఎకరాలను మున్సిపల్ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. కావలి పట్టణ రైల్వేరోడ్డులోని జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలి పట్టణంలోని రియల్ఎస్టేట్ వ్యాపారస్తులు అక్రమంగా ఆక్రమించిన ప్రభుత్వభూమిని వెంటనే స్వాధీనంచేసుకుని ఆ ప్రదేశాలలో సూచిక బోర్డులను ఏర్పాటుచేయాలన్నారు. గత రెండునెలల క్రితం మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్ మీడియాసమావేశంలో వివరాలు బహిర్గతం చేశారన్నారు. కావలి పట్టణంలోని వివిధ సర్వేనెంబర్లలో కొంతమంది రియల్టర్లు రియల్ఎస్టేట్ వ్యాపారంకోసం ప్రభుత్వభూమిని ఆక్రమించుకుని ప్లాట్లువేసి అమ్ముకున్నారని కమీషనర్ తెలియచేయడం జరిగిందన్నారు. అయితే, ఆ ప్రభుత్వభూమిని కావలి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ ఆర్డీఓ, మున్సిపల్ కమీషనర్‌లు స్వాధీనపర్చుకుని హద్దురాళ్లను, సూచికబోర్డులను ఏర్పాటుచేసి ప్రజలకు తెలియచేయాలన్నారు. ఈ ప్రభుత్వభూముల్లో ప్లాట్లుకొని మోసపోయినవారికి రెవిన్యూ, మున్సిపల్ అధికారులు అదే రియల్టర్లనుంచి వేరుప్లాట్స్‌ను వారిలేఔట్లలో కేటాయించేవిధంగా చర్యలుగైకొనాలని డిమాండ్‌చేశారు. అలా చెయ్యనియెడల బాధితులు మమ్మల్ని సంప్రదిస్తే వారితరఫున పోరాటంచేసి వారికి ప్లాట్లువచ్చేవిధంగా ప్రయత్నంచేస్తామన్నారు. అంతేకాకుండా కొంతమంది చెరువులను సైతం ఆక్రమించుకుని ఉన్నారన్నారు. వాటినికూడా వెలికితీయాలని అధికారులను డిమాండ్‌చేశారు. మున్సిపల్, రెవిన్యూ, సంబంధిత అధికారులకు సంక్రాంతివరకు గడువుఇస్తామని తెలిపారు. ఈ లోపల రియల్టర్లనుంచి ఆ ప్రభుత్వభూములను స్వాధీనంచేసుకోకపోతే సిపిఐపార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరికలుచేశారు. గత ఐదు సంవత్సరాలలో ప్రతిపక్షంలో ఉన్నపుడు చంద్రబాబునాయుడు గ్రామీణప్రాంత ప్రజలకు 3సెంట్లు ఇళ్లస్థలము ఇస్తానని ఎన్నికల్లోకూడా హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే పెరిగినధరలకు అణుగుణంగా ఇళ్లనిర్మాణాల వ్యయం ఎక్కువైందని అందుకు తగ్గట్టుగా ఇళ్ళు నిర్మించేకునేందుకు 4లక్షల రూపాయలు హౌసింగ్‌లోన్ ఇప్పిస్తామని తెలియచేయడం జరిగిందన్నారు. లబ్దిదారులకు ఆయన హామీమేరకు అందచేయాలన్నారు. లబ్దిదారులకు ఇళ్లనిర్మాణాలకోసం గృహనిర్మాణసంస్థ, ప్రభుత్వం లబ్దిదారులను సచివాలయాల్లో దరఖాస్తుచేసుకోమని చెప్పడం జరిగిందన్నారు. సచివాలయాల్లో టైమ్ అయిపోయిందని కొందరు చెబుతున్నారన్నారు. కావలి ఆర్డీఓ, మున్సిపల్ కమీషనర్లు చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేస్తూ ఆక్రమణలకు గురైన ప్రభుత్వభూమిని స్వాధీనపరచుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా రైతుసంఘంనేత బలిజేపల్లి వెంకటేశ్వర్లు, పట్టణకార్యదర్శి కొప్పర్తి నాగరాజు, సిపిఐనేత చేవూరు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాలయం పీఠాధిపతితో చంద్రబాబును కలిసిన కావలి ఎమ్మెల్యే

### రాజధాని నిర్మాణానికి 50లక్షల విరాళం



**కావలి, డిసెంబర్ 5 ప్రభాతవార్త** మంత్రాలయం శ్రీ గురు రాఘవేంద్రస్వామి మఠ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుధేంద్రతీర్థులతో కలిసి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును, విద్యాశాఖ మంత్రి నారా లోకేషలను కలిశారు. ఉండవల్లిలోని వారినివాసంలో పీఠాధిపతితో కావలి ఎమ్మెల్యే దగుమాటి కలిశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును పీఠాధిపతి ఆశీర్వదించారు. రాజధాని నిర్మాణానికి 50లక్షల రూపాయల విరాళాన్ని ముఖ్యమంత్రికి అందచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలు పీఠాధిపతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి

### జిల్లాలో 2604 పాఠశాలలలో పేరెంట్ టీచర్ మీటింగ్

బడి పిల్లల తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా హాజరుకావాలి
జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ పిలుపు



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 5, ప్రభాతవార్త** తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశంనకు జిల్లా లోని బడి పిల్లల తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ పిలుపునిచ్చారు.డిసెంబర్ 7 న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరగనున్న సందర్భంగా గురువారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ శనివారం జిల్లాలోని 2604 పాఠశాలల్లోజరగబోవు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం,నాణ్యతతో కూడిన చదువుల కోసం ఈ సమావేశాలు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. అభ్యాసన వ్యవస్థలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాలు ముఖ్యమైన భాగమని, పిల్లలకు గల బలాలు, బలహీనతలపై చర్చించుకోవడానికి, తద్వారా వారి ఎదుగుదలకు ఉపయోగ పడుతాయన్నారు. అంతేకాకుండా పాఠశాలల అవసరాలను తల్లిదండ్రుల కోణంలో గుర్తించటానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని జనాభాలో దాదాపు ఐదవ వంతు మంది హాజరయ్యే ఈ సమావేశాలకు అందుకు తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు వివిధ పాఠశాలలకు హాజరవుతారన్నారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఒక షెడ్యూల్ ప్రకారం వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఇందుకోసం ఇప్పటికే అన్ని పాఠశాలల్లో వివిధ కమిటీలను నియమించామన్నారు. ప్రతి విద్యార్థి తన స్వదస్తూరితో వారి తల్లిదండ్రులను ఆహ్వానిస్తూ వినూత్నంగా ఆహ్వాన పత్రికలు తయారుచేసి అందజేశారన్నారు. అలాగే ఉపాధ్యాయులు ఎస్ఎంఎస్ లు, మొబైల్ ద్వారా ఆయా తల్లిదండ్రులను హాజరు కావలసిందిగా ఆహ్వానించారన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాలకు జిల్లాస్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు హాజరవుతారన్నారు. అలాగే తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పిల్లలకు పెర్ఫార్మెన్స్ కార్డ్స్ అందజేస్తామన్నారు. అదేవిధంగా గుర్తించిన 42 పాఠశాలల్లో ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించి హెల్త్ కార్డ్స్ అందజేస్తామన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు పూర్తయినందున వారి ఆధ్వర్యంలోనే చర్చలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. పిల్లల భవిష్యత్తు, పాఠశాల అభివృద్ధి లక్ష్యంగా జరుగుతున్న ఈ సమావేశాలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా రావాలని, మీ పిల్లల కోసం ఒకరోజు కేటాయించాలని కోరారు. ప్రతిరోజు పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఆరోజు వారి తల్లిదండ్రులు కూడా అందిస్తామని, అందరితో సహపంక్తి భోజనాలతో సమావేశాలు ముగుస్తాయన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున నిర్వహించే ఈ సమావేశాలకు ప్రత్యేకంగా కలెక్టరేట్లో వివిధ శాఖల సిబ్బందితో ఆరోజు ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు పనిచేసే విధంగా ప్రత్యేక కంట్రోల్ రూమ్ సైతం ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం 48 లక్షలు కేటాయించామన్నారు.ప్రతి మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్ ను నియమించామన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి ఎమ్మెల్యే



**కందుకూరు, డిసెంబర్ 5, ప్రభాతవార్త** గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 6వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు ఉదయం 9గంటల నుండి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రీ సర్వే పేరిట ఒకరి భూమి మరొకరికి ఆన్‌లైన్ చేయడం, రికార్డుల్లో భూమి కొలతల్లో మార్పులు లాంటి పలు సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం మీ యొక్క గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలో రైతులు ఎవరైనా భూ సమస్యలు ఉంటే రాష్ట్ర ప్రభుత్వం మీ గ్రామాల్లో నిర్వహించు రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పిస్తే తగు విచారణ చేసి త్వరితగతిన సమస్యను పరిష్కారం చేస్తారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలియజేశారు.

## జిల్లాలో నేటి నుండి రెవిన్యూ సదస్సులు భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

డిసెంబర్ 6 నుండి జనవరి 8 వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ బృందాల పర్యటన
- జాయింట్ కలెక్టర్ కార్తీక్



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 5, ప్రభాతవార్త** జిల్లాలో నేటి( 6వ తేది) నుండి జనవరి 8 వరకు ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ వెల్లడించారు. గ్రామాలలో రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదన్నారు. భూ సమస్యలకు సంబంధించిన అభ్యంతరాలను సదస్సులలో అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. సమస్యలపై బాధితులు ప్రభుత్వం చుట్టూ తిరగకుండా ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి పరిష్కరించాలనే ఉద్దేశంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదన్నారు. భూ కొలతలలో తేడాలు,సర్వే నంబర్లలో మార్పులు ,వారసత్వ పేర్లు నమోదు, సరిహద్దు సమస్యలు, భూవిస్తీర్ణంలో తేడాలు ,రీ సర్వేలో తప్పులు ,కబ్జాలతో ప్రజలు కోల్పోయిన భూములు, అసైన్డ్, చుక్కల భూముల వంటి వాటిపై వినతులు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. సదస్సుల నిర్వహణ కోసం ప్రతి మండలానికి ఒక నోడల్ అధికారిని జిల్లా కలెక్టర్ నియమించారన్నారు .సదస్సులకు మండల తాసిల్దారులతో పాటు భూముల విషయానికి సంబంధించిన రెవెన్యూ డిటిలు, ఆర్.ఐ లు,వీ ఆర్వోలు, సర్వేయర్లు ,వక్ఫ్ ,అటవీ అధికారులు హాజరవుతారన్నారు.భూములకు సంబంధించిన అన్ని రికా ర్డులతో రెవెన్యూ బృందాలు హాజరు కావాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు .రీ సర్వేలో వచ్చిన ఫిర్యాదులు నిబంధనల ప్రకారం గ్రామ పెద్దలు, సర్పంచ్ ల సమక్షంలో వివరించి పరిష్కరిస్తామన్నారు. ఈ సదస్సులు గ్రామాలలో ఉదయం 9 గంటలకు ప్రారంభ మవుతాయన్నారు. రైతులు,ప్రజల నుండి అందిన పిటిషన్లను పీజీఆర్ఎస్ లో నమోదు చేస్తారని పరిష్కరించగలిగిన అక్కడికక్కడే పరిష్కరించడంతోపాటుమిగిలినవి ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. రెవెన్యు సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు.

## బాగా కష్టపడితేనే అనుకున్న విజయం వరిస్తుంది

పాలిటెక్‌ఫెస్ట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దగుమాటి






**కావలి, డిసెంబర్ 5 ప్రభాతవార్త** బాగా కష్టపడితే అనుకున్న లక్ష్యాలతోపాటు విజయం వరిస్తుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి రూరల్ మండలం రుద్రకోట గ్రామంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన నెల్లూరు రీజియన్ పాలీటెక్‌ఫెస్ట్ 2024ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనాఉందన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రుల లక్ష్యాలను ఛేదించాలన్నారు. రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ ఫెస్ట్‌ను ప్రారంభించడానికి తానురావడం చాలా ఆనందంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ సహకారంతో ఈ కళాశాల ఇక్కడ ఏర్పాటుచేసేందుకు తాను ఎంతగానో కృషిచేశానన్నారు. విద్యార్థులు సాంకేతికపరంగా మంచి విజ్ఞానాన్ని సముపార్జించుకుని దేశాన్ని సాంకేతికరంగంలో ముందువరుసలో నిలపాలన్నారు. ప్రపంచంలోనే భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపి తమ భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒకమంచి మిత్రుడిని ఎన్నుకోవాలన్నారు. చీకట్లలోనే కాంతిని, నష్టాల్లోనే లాభాలను, కష్టాలలోనే సుఖాలను, అవమానాల్లోనే సన్మానాన్ని, ఓటమిలోనే గెలుపును సాధించాలన్నారు. రానున్నరోజుల్లో కావలి నియోజకవర్గానికి అనేక భారీ పరిశ్రమలను తీసుకువస్తామన్నారు. కావలిని ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ పారిశ్రామికవాడగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ ప్రదర్శనలో నెల్లూరు రీజియన్‌లోని 8 కళాశాలల నుండి 166 మంది విద్యార్థులు, 12 మంది గైడ్లు పాల్గొని 56 వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎనిమిది ఎగ్జిబిషన్ హాళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రదర్శనల గురించి ఎమ్మెల్యే విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ జాయింట్ డైరక్టర్ ఎ.నిర్మల్‌కుమార్‌ప్రియ, ప్రిన్సిపాల్ ఎ.సుశీల్‌కుమార్‌ప్రియ, విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కొన్నిపాఠశాలలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులు ఈ ప్రదర్శనలను సందర్శించారు. ఈ ఎగ్జిబిషన్ డిసెంబర్ 6వ తేదీవరకు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కావలి నియోజకవర్గ లీగల్‌కన్వీనర్, ఎమ్మెస్సార్ డిగ్రీకళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, టిడిపినేత మాజీ ఏఎంసి డైరక్టర్ తిరివీధి ప్రసాద్, లోక్‌సత్తానేత యం.మాలకొండారెడ్డి, టిడిపి నేతలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే ప్రశంసలు అందుకున్నారు.

## డెకరేషన్ దుకాణంలో అగ్నిప్రమాదం

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :** స్థానిక వనం తోపు సెంటర్ లోని ఓ ప్రముఖ ఫ్లవర్ డెకరేషన్ దుకాణంలో గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దుకాణ వాచ్మెన్ మణి మంటలను గమనించి యజమాని రవికుమార్ కు సమాచారం అందించారు. అతని నుండి సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 70 విలువ చేసే ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు వేదయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేపట్టారు.

## బుచ్చి మండలంలో చికెన్ వ్యర్థాలు పట్టుకున్న పోలీసులు



**బుచ్చి డిసెంబర్ 5 ప్రభాతవార్త** మండలంలోని పెనుబల్లి గ్రామ సమీపంలో చికెన్ వ్యర్థాలతో వెలుతున్న లారీ మట్టిలో ఇరుకుంది. మట్టిలో ఇరుకున్న లారీని జెసిబి సహాయంతో బయటికి తీసేందుకు వేస్టు మాఫీయా ప్రయత్నిస్తున్నారు.దీంతో సమాచారం అందుకున్న ఎస్ఐ సంతోష్‌రెడ్డి,మత్యశాఖ అధికారులు ఆప్రాంతానికి చేరుకొని లారీని స్వాధీనం చేసుకున్నారు. మత్స్యశాఖ అధికారి పొట్టయ్య మాట్లాడుతు మండలంలో చికెన్ వ్యర్థాల రవాణా చేస్తు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే అక్వా రైతులకు ప్రతి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. అక్వారైతులు చికెన్ వ్యర్థాలను వినియోగిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## దొంగల స్వైర విహారం..

### 12 సవర్ల బంగారు నగలు, 400 గ్రాములు వెండి పట్టీలు చోరీ

పడుగుపాడు బృందావన కాలనీలో ఘటన



**కోవూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త : ఇంటి తాళం** వేస్తే చాలు.. ఆరితేరిన దొంగలు ఇంటి తాళాలు పగలకొట్టి దర్జాగా ఇంట్లో ప్రవేశించి దొరికిన వస్తువులను దోచుకుపోవడం పరిపాటిగా మారింది. పోలీసులు ఇంటి నుంచి వేరే ప్రాంతాలకు గానీ, వివాహ కార్యక్రమాలకు గానీ వెళ్లేటప్పుడు తప్పనిసరిగా పోలీస్ శాఖకు సంబంధించిన లాక్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌ను ఉపయోగించు కోవాలని చెప్పినా.. దానిని ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫలితంగా రెండు రోజుల పాటు ఇంటికి తాళాలు వేసిన ఇంటినే ఎంచుకుని చోరీ చేయడం ఈ దొంగలకు పరిపాటిగా మారింది. ఇప్పటికైనా ప్రజలు పోలీస్‌శాఖకు పూర్తిస్థాయిలో సహకరిస్తే దొంగతనాలు పూర్తిస్థాయిలో అరికట్టేందుకు అవకాశం ఉంటుంది. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ బృందావనం కాలనీలో బేల్దారి మేస్త్రిగా పనిచేసే ఖాజామొహిద్దీన్ కుటుంబం 60వ నెంబర్ ప్లాట్‌లో నివాసం ఉంటున్నారు. కోడలు వెంకటేశ్వరపురంలో ఉండడంతో రెండు రోజులు అక్కడ.. రెండు రోజులు ఇక్కడ ఈ దంపతులు ఉంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలో 3వ తేది సాయంత్రం ఇంటికి తాళాలు వేసి వెంకటేశ్వరపురంకు వెళ్లారు. ఈ పరిస్థితుల్లో 5వ తేది ఉదయం 8 గంటల ప్రాంతంలో ఖాజామొహిద్దీన్ ఇంటి ఎదురుగా ఉండే సుధీర్ ఫోన్ చేసి మీ ఇంటి తాళాలు పగలకొట్టి ఉన్నాయని చెప్పడంతో ఖాజామొహిద్దీన్ దంపతులు హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగలకొట్టి బెడ్‌రూమ్‌లోకి ప్రవేశించి సుమారు 12 సవర్లు బంగారం, 400 గ్రాముల విలువ చేసే వెండి పట్టీలను అపహరించుకుపోయారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ బృందం కూడా వచ్చి వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇంటికి తాళాలు వేసి రెండు, మూడు రోజుల పాటు వేరే ప్రాంతాలకు వెళ్లేవారు తప్పనిసరిగా పోలీస్‌శాఖకు సమాచారం ఇస్తే లాక్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో నమోదు చేసుకుని ఆ ఇంటి పరిసర ప్రాంతాలను గస్తీ దళం పరిశీలన చేసే అవకాశం కూడా ఉంటుందని, ఈ మా నిటరింగ్ సిస్టమ్ యాప్‌ను ప్రజలు పూర్తి స్థాయిలో ఉపయోగించు కోవాలన్నారు.



## షాన్‌వాజ్‌కు 10వేలు ఆర్థికసాయం



**ఆత్మకూరు, డిసెంబర్5, ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని చావిడి వద్ద ఉన్న షాన్వాజ్ అనారోగ్యానికి గురయ్యాడు . ఆయన ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్న ఆత్మకూరు లైన్స్‌క్లబ్ సభ్యులు గురువారం తమ లైన్స్‌క్లబ్ తరపున 10వేల రూపాయలు ఆర్థికసహాయం అందజేశారు. ఈకార్యక్రమంలోలైన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## నేటినుండి రెవెన్యూ సదస్సులు

**వింజమూరు, డిసెంబర్5, ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో శుక్రవారం నుండి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసిల్దార్ హమీద్ పేర్కొన్నారు. శుక్రవారం చాకలికొండ సచివాలయం ,7న కాటేపల్లి సచివాలయం, 10న రావిపాడు పంచాయతీ కార్యాలయం, 11న ఊటుకూరు సచివాలయం, 12న శంఖవరం, 13న గుండెమడకల, 17న చింతలపాళెం ఎంపిపి స్కూల్లో ఉదయం, సాయంత్రం చంద్రపడియ సచివాలయం , 18న వింజమూరు పంచాయతీ కార్యాలయం, 19న తమిదపాడు ఎంపిపి స్కూల్, 20న నల్లగొండ్ల పంచాయతీ కార్యాలయం, 21న జనార్ధనపురం ఎంపిపి స్కూల్, 24న ఎ.కిస్తీపురం ఎంపిపి స్కూల్, 27న నందిగుంట ఎంపిపి స్కూల్, 31న బుక్కాపురం సచివాలయంలో గ్రామసభలు జరుగుతాయని తహసిల్దార్ తెలిపారు. ఆగ్రామసభల్లో ప్రజలు పాల్గొని రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

## కరటంపాడు ఎస్టీ సెంటర్‌లో ఇసిసిఇ డే



**ఆత్మకూరు, డిసెంబర్5, ప్రభాతవార్త:** మండలంలోని కరటంపాడు ఎస్టీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఇసిసిఇడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే (ఇసిసిఇడే) ను నిర్వహిస్తారని , ఈ సందర్భంగా అంగన్‌వాడీ పరిధిలోని తల్లులు, మహిళలను సమావేశపరచి వారికి తమ పిల్లలు చేస్తున్న కార్యక్రమాలను గురించి తల్లులకు అవగాహన కల్పించారు. పిల్లల్లో కలిగే అభివృద్ధుల గురించి తెలిపారు. చిన్నారులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. వారికి చేతుల శుభ్రత గురించి వివరించారు. చిన్నారులకు , గర్భవతులకు, బాలింతలకు అందిస్తున్న సేవల గురించి, పౌష్టికాహారం గురించి తెలిపారు. పిల్లలందరిని చదివించాలని, డ్రాపవుట్స్ లేకుండా చూడాలని ఆమె పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మినీ వర్కర్ లిస్సి,ఉపాధ్యాయులు, తల్లులు, గర్భవతులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి : రమేష్‌రెడ్డి



**ఉదయగిరి, డిసెంబర్ 5, ప్రభాతవార్త** ఎన్డీఏ కూటమి ఉదయగిరి నియోజకవర్గ నాయకుల కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ నాయకులు మూడమాల రమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉదయగిరిలోని గ్రామ పంచాయతీ కార్యాలయంఎదురుగా ఉన్న రాణి కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం పది గంటలకు ఆత్మీయ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షులు ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా నియమితులైన సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి బీజేపీ ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన నాయకులు, బీజేపీ వైఎం అనుబంధ సంఘాల కార్యకర్తలు, భారీ స్థాయిలో పాల్గొని జయప్రదం చేయాలని ముడుమాల రమేష్‌రెడ్డి తెలిపారు.

## వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ : సంజయ్ కుమార్



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 5, ప్రభాతవార్త** జిల్లాలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వలన లోతట్టు ప్రజలు కు నిత్యవసర సరుకులు అందించినట్లు కాంగ్రెస్ పార్టీ మీడి యా ఇంచార్జ్ సంజయ్ కుమార్ తెలిపారు. నెల్లూరు జిల్లా డీసీసీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్ రెడ్డి పిలుపు మేరకు కొత్తూరు వద్ద నివసిస్తున్న కాలనీవాసులకు నిత్యవసర సరు కులు కొంతమేరకు అందజేశామని తెలిపారు. కురుస్తున్న వర్షాలు వల్ల, పనులు లేక, ఆహారం కూడా వండుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సంజయ్ కోరారు. జిల్లా అంతటా వరి పంట మునిగిపో యిం దని, రవిచంద్ర గిరిజన కాలనీలోని ఇళ్లల్లోకి నీళ్లు వచ్చాయని, గోడలు నాని కూలిపోయే ప్రమాదం ఉందని, సహాయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని కోరారు. ఇర్ఫాన్, దీపక్ పాల్గొన్నారు

## జనతాపేటలో శుభలక్షమ్మ పెద్దకర్మలోపాల్గొన్న ఎమ్మెల్యే



**కావలి, డిసెంబర్ 5 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని జనతాపేటకు చెందిన తోట్రెడ్డి శుభలక్షమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో గురువారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతిని వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేవెంట టిడిపి కావలి నియోజకవర్గ లీగల్ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, తిరివీధి ప్రసాద్, డాకా శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కావలి ఎమ్మెల్యే



**కావలి, డిసెంబర్ 5 ప్రభాతవార్త** టివియస్ మెమోరియల్ చారిటబుల్‌ట్రస్ట్ నూతన క్యాలెండర్‌ను గురు వారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ చారిటబుల్‌ట్రస్ట్ సభ్యులు కావలి ముసునూరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లారు. ఎమ్మెల్యే దగుమాటిని దుశ్శాలువాలతో సత్కరించి పూలమొక్కను అందచేశారు. ఈ చారిటబు ల్‌ట్ర స్ట్ సేవాకార్యక్రమాలను ఎమ్మెల్యే అడిగితెలుసుకున్నారు. ట్రస్ట్‌ద్వారా ఇప్పటివరకు చేసిన కార్యక్రమాలను అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు వివరించారు. సేవాకార్యక్రమాలు ఇంకాబాగా విస్తరింపచేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌చైర్మన్ తోట వెంకటేశ్వర్లుతోపాటు కార్యదర్శి గాదిరెడ్డి హరినాథ్, ట్రెజరర్ వేములపాటి మాధవ, లోక్‌సత్తానేత యం.మాలకొండారెడ్డి, ట్రస్ట్‌సభ్యులు గుణకల శివయ్య, ప్రియదర్శిని మహిళామండలి స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షులు యస్.కె.ఖాదర్‌బి, తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందాలు ఆడుతున్న వారు అరెస్ట్...

**కావలి రూరల్, డిసెంబర్ 5, ప్రభాతవార్త** : కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి. రాజేశ్వర రావు ఉత్తర్వులురకు కావలి రూరల్ ఎస్సై యం.బాజీబాబు, ఎస్సై .తిరుమల రెడ్డి, ఎస్సై బాలకృష్ణ వారి సిబ్బందితో కలిసి కావలి మండలం, అన్నగారి పాలెం అటవీ ప్రాంతం నందు కోడి పందాలు ఆడుతుండగా నలుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి 7250 రూపాయలను,5 కోడి పుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి రాజేశ్వరరావు మాట్లాడారు ఎక్కడైనా గ్రామాలలో పేకాట, కోడిపందాలు ఆడుతున్నట్లు, గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉన్నచో వెంటనే తెలియపరచవలసినదిగా కోరడం జరిగింది

## ముంగమూరులో ఎమ్మెల్యే పరామర్శ



**బిట్రగుంట, డిసెంబర్ 5, ప్రభాతవార్త:** బోగోలు మండలం ముంగమూరుకు చెందిన యన్నాబత్తిన వెంకటేశ్వర్లు సమీప బంధువు వంటేరు శ్రీనివాసులు గారి పెద్దకర్మ ముంగమూరులో గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్టారెడ్డి పాల్గొని శ్రీనివాసులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎ ఎమ్ సి ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం టీడీపీ నాయకులు మాలేపాటి నాగేశ్వరరావు, సుధీర్, చిలకపాటి వెంకటేశ్వర్లు, ఎన్నాబత్తిన వెంకటేశ్వర్లు, గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, తిరివీధి ప్రసాద్, డాకా శ్రీనివాసులు రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యాన శాఖ ద్వారా మిని నర్సీరీలకు రాయితీ



**కలువాయి డిసెంబర్ 5 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా మిని నర్సరీలు ఏర్పాటు చేసుకు నేందుకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని మండల ఉద్యాన అధికారి మిధిలా తెలిపారు. స్థానిక కార్యాలయం నందు మిధిలా రైతులతో మాట్లాడుతు యూనిట్ విలువ 15 లక్షలుగాను 7.5 లక్షలు ఉద్యాన శాఖ ధ్వారా రైతులు రాయితీ పొందవచ్చునని అని ఆమె తెలిపారు. 60+40 అడుగులు కలెక్షన్ సెంటర్‌కు ఆరు లక్షల రాయితీ అదే విధంగా సోలార్ కోల్డ్ రూమ్ ఏర్పాటు చేసుకొని రైతులకు 5.25 లక్షల రాయితీ ఇవ్వడం జరిగిందని అన్నారు. పూర్తి వివరాలకోసం రైతులు ఉద్యాన అధికారిని సంప్రదించాలని కోరారు.

## మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల ఉదయగిరి నందు గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవం



**ఉదయగిరి, డిసెంబర్ 5, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి మేకపాటి గౌతమ్ రెడ్డి వ్యవసాయ కళాశాలలో గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. నేల సంరక్షణ పర్యవేక్షణ, నిర్వ హణ చర్యలు అనే అంశంపై విద్యార్థినీ, విద్యార్థులకు విపులంగా వివరించారు. మనిషి ఉనికికి జీవనానికి మట్టి మూలధారమని, ఆరోగ్యవంతమైన నేల ఉన్నప్పుడే ప్రపంచ వ్యాప్తంగా జనాభాను పోషించడానికి కావాల్సిన ఆహార ఉత్పత్తి సాధ్యమవుతుందని అయితే నానాటికి నేలపై పొర దెబ్బ తింటుందని ఇది ఆహార భద్రతపై ప్రమాదగంటికలు మోగిస్తుందని, మన పాదాల కింద ఉన్న నేల ఒక జీవ వ్యవస్థ, అనేక మనోహరమైన మొక్కలుచెట్లు జంతువులకు నిలయమని నేల మనకు పోషకాహారాన్ని స్వచ్ఛమైన నీటిని జీవవైవిద్యాన్ని అందిస్తుందని వివరించారు. భూసార విభాగం టీచింగ్ అసోసియేట్ డాక్టర్ సూర్య మాట్లాడుతూ మట్టిని ఏ విధంగా కాపాడుకోవాలో మట్టి యొక్క ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థినీ, విద్యార్థులు భరత్ కుమార్, హేమలత, నరేంద్ర, బిందు లావణ్య, మహిత మట్టి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థి కార్యకలాపాల అధికారి డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ సునీత, డాక్టర్ రమేష్, డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ కిషన్ తేజ, బోధనేతర సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మడపల్లిలో పొలం పిలుస్తోందిపై అవగాహన



చేజర్ల డిసెంబర్ 5 ప్రభాతవార్త చేజర్ల మండలంలోని మడపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి మండల వ్యవసాయశాఖాధికారి శశిదర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతు రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ప్రతి మంగళవారం బుధవారం పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి సూచనలు సలహాలు అందిస్తారని తెలిపారు. వరిసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. నారుమడుగు రైతులు ఎప్పుడు వేసుకోవాలో యాజమాన్య పద్ధతులపై తెలిపారు. పంటలకు సోకే తెగుళ్ళ నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలో రైతులకు తెలియజేశారు. జింక్ లోపం లేకుండా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.

# వెలుగు సిబ్బంది పనితీరు అధ్వానం

### పట్టించుకోని అధికారులు .. ఇన్‌చార్జీ ఏపీఎంగా సురేష్




**వలేటివారిపాలెం డిశంబరు 5, ప్రభాతవార్త** స్థానిక అధికారుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల అశ్రద్ధ కారణంగా వలేటివారిపాలెం మండలంలో ఆశాఖ పనితీరు అధ్వానంగా ఉంది. రెండేళ్లకి పైగా రెగ్యులర్ ఏపీఎం లేకపోవడంతో పర్యవేక్షణలోపించింది. సీసీలు గ్రామాల్లో పట్టుకోల్పోయారు. లోను మంజూరు, రికవరీలో జాప్యం జరుగుతుంది. పలువురు వీవోఏలుతోపాటు మరికొందరు సభ్యులు పలు అవకతవకలకు పాల్పడుతున్నారు. లోను సొమ్మును ఆయా ఖాతాలకు జమచేయకుండా సభ్యులను తప్పు దోవపట్టించి వ్యక్తిఖాతాలకు జమచేసుకుంటున్నారు. ఈ విషయంలో గత ప్రభుత్వంలో పనిచేసిన ఏపీఎంల పాత్ర చర్చనీయాంశమైంది. సకాలంలో రికవరీ లేకపోవడంతో స్త్రీనిధిలోను మంజూరు నిలువుదల చేశారు .ప్రతినెలా సకాలంలో సమావేశాలు నిర్వహించి సమాచారం అందించాల్సిన వెలుగు సిబ్బంది ఆ దిశగా పనిచేయడం లేదు. ఈ విషయం గమనించి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వెలుగు సిబ్బంది పనితీరును ఆరా తీశారు. రెగ్యులర్ ఏపీఎం నియామకం గురించి ఉన్నతాధికారులతో చర్చించారు. కందుకూరు ఏపీఎంకి అదనపు బాధ్యతలకి సిఫారుసు చేశారు.

**లోపభూయిష్టంగా అజమాయిషీ:** పొదుపు సంఘాల పర్యవేక్షణ లోపభూయిష్టంగా ఉంది. మహిళా సాధికారిత సాధించాలన్న ఆశయం సంగతి దేవుడెరుగు కనీసం అవగాహన సమావేశాలు నిర్వహించే నాధుడే లేరు. దీంతో పొదుపు సంఘాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. గ్రామసభలులేవు సమావేశాలు లేవు. బ్యాంక్‌లోను మంజూరు సమయంలో మాత్రం తీర్మానాలు రాసుకోవడంతో ఎస్‌హెచ్‌జీ సమావేశాలుతో సరిపెట్టుకుంటారు. మొబైల్ బుక్‌కీపింగు లేదు. రికార్డు మాత్రం అన్నీ ఉన్నట్లు రాసుకుంటారు. రెండేళ్లుగా ఏపీఎం,సీసీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్నతాధికారులకు ఇక్కడేమి జరుగుతుందో గమనించడం లేదు. పలితంగా పొదుపు సంఘాల పనితీరు ఎవరికివారే యమునా తీరే అన్నచందంగా తయారైంది.

**రుణాల రికవరీలో పలు అవకతవకలు:** గత ప్రభుత్వహయాంలో కొందరి సిబ్బంది స్వార్ధం వలన పలు అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఎస్‌హెచ్‌జి సభ్యుల నుంచి కొందరు వీవోఏలు నెలవారీ చెల్లించాల్సిన లోను రికవరీ సొమ్మును వసూలు చేసుకొని తమ ఖాతాల్లో జమచేసినట్లు సమాచారం. లోను మొత్తం పూర్తిఅయి కొత్తలోనుకి వెళ్లినపుడు ఈ బాగోతం వెలుగులోకి వచ్చింది. తదుపరి విచారణలో సంబందిత వీవోఏ నుంచి సుమారు రూ.7లక్షలు రికవరీ చేశారు. అదేవిధంగా ఒక వీవోకి చెల్లించాల్సిన సొమ్మును మరొక వీవోలో చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో బాగంగా ఒకబడేవారిపాలెంలో సుమారు రూ.16లక్షలు అక్రమంగా గోల్‌మాల్ అయినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు ఎమ్మెల్యే నాగేశ్వరరావుకి సైతం పిర్యాదు చేసినట్లు సమాచారం. గత ప్రభుత్వహయాంలో బడేవారిపాలెంలో అప్పటి ఏపీఎం చొరవతో సంఘానికి సంబందించి ఓ వాహనం కొనుగోలులో అవినీతి చోటుచేసుకుంది. అదే విధంగా అత్తంటివారిపాలెం, శామీరపాలెం, శింగమనేనిపల్లె, పోకూరు, శాఖవరం, కాకుటూరు తదితర గ్రామాల్లో గ్రామసంఘాల ఖాతాలలో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**పడిపోయిన రికవరీ:** గతంలో ప్రభుత్వం స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి, ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ తదితర పథకాల ద్వారా రుణాలు మంజూరు చేశారు. ఒక్క స్త్రీనిధి పథకం కింద మండలానికి సుమారు రూ.2 కోట్లు మంజూరుచేశారు. ఈ రుణాన్ని రికవరీ చేసి తిరిగి మరలా ఇంకొన్ని గ్రూపులకు మంజూరు చేస్తారు. అయితే వలేటివారిపాలెం మండలంలో రికవరీ ఎన్‌పీఎల్‌కి పడిపోయింది. దీంతో స్త్రీనిధి రుణాల మంజూరు నిలుపుదల చేశారు. బడేవారిపాలెం, నలదలపూరు, పోకూరు, శాఖవరం, అత్తంటివారిపాలెం, కలవళ్ల తదితర గ్రామాల్లో రికవరీ బాగా పడిపోయింది. సిబ్బందికి గ్రామాల్లో పట్టుతప్పింది. బ్యాంకు రుణానికి వెళ్లేటపుడు మాత్రం సీసీలు పొదుపు సంఘాలకు ఆ రోజు తీర్మానం రాసి బ్యాంకులకు అందచేస్తారు. ఇదీ సీసీల పనితీరు. ఆ తీర్మానాల కోసం పొదుపు సభ్యులు సీసీల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన సాధికారిత, మహిళాభివృద్ధి కాగితాలకే పరిమితం.

**ఇన్‌చార్జీ ఏపీఎంగా సురేష్:** వెలుగుకార్యాలయ పనితీరుపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆరా తీసినట్లు సమాచారం. వెంటనే రెగ్యులర్ ఏపీఎంను నియమించాల్సిందిగా జిల్లా అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు అప్పటిదాకా కందుకూరు ఏపీఎం సురేష్‌కి ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించనున్నట్లు కందుకూరు ఏరియా కోఆర్డినేటర్ సింహాద్రి తెలిపారు.

## విధి నిర్వహణలో అంకితభావమే.. శ్రీహరి



**కోవూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త** : ప్రభుత్వం విడుదల చేసే అన్ని పథకాలు పూర్తిస్థాయిలో విజయవంతం చేయడమే కాకుండా విధి నిర్వహణలో అంకితభావం చూపుతూ ఉన్నతాధికారుల మన్ననలు పొందిన వ్యక్తి శ్రీహరి అని వివిధ శాఖల అధికారులు పేర్కొన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం కోవూరు ఎంపీడీవోగా పనిచేస్తూ బుచ్చిరెడ్డిపాలెం ఎంపీడీవోగా బదిలీ అయిన ఎం. శ్రీహరికి కోవూరు మండల పరిషత్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది గురువారం సాయంత్రం ఘన సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ శ్రీహరి ఏ మండలంలో పనిచేసినా ఆ మండలంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో ప్రత్యేక పాత్ర పోషించేవారన్నారు. ప్రజాప్రతినిధులతో కూడా సమన్వయం చేసుకుని ఆ పథకాలు విజయవంతం చేసేలా చొరవ చూపేవారన్నారు. ప్రభుత్వం ఉద్యోగంలో పనిచేసే వారు బదిలీలు సాధారణమని, అయితే పనిచేసే చోట ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో చొరవ చూపిన వారు ఇటు ప్రజాప్రతినిధులు, అటు ప్రజల్లో నిలిచిపోతారని, ఆ కోవకు చెందిన వక్తే శ్రీహరి అన్నారు. అనంతరం సన్మాన గ్రహీత శ్రీహరి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, మండల పరిషత్ ఉద్యోగుల సమిష్టి సహకారంతో ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. తనను సన్మానించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలానందబాబా, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ పరమేశ్వరలింగం, కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్లు సురేష్,, జెడ్పీటీసీ శ్రీలత, గ్రామ సర్పంచ్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ అమరావతి, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ పార్టీ సీనియర్ నాయకులు వేగూరు సుబ్బానాయుడు, శ్రీనివాసులు, నాటకరాణి వెంకట్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనను భారీ పూలమాల, పూల కిరీటంతో ఘనంగా సత్కరించారు.

## అర్జీల పరిష్కారంపై ప్రత్యేక చొరవ



కోవూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త : కోవూరు మండలం గంగవరం పంచాయతీకి సంబంధించి తన పొలంలో పంచాయతీకి సంబంధించిన మురుగునీరు వస్తుందని గ్రామ రైతు మహేష్‌రెడ్డి ప్రజా విజ్ఞప్తుల దినంలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు గురువారం గంగవరం పంచాయతీలో ఆ సమస్య ఉన్న ప్రాంతాన్ని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి పరిశీలన చేపట్టారు. ప్రస్తుతం ఈ పంచాయతీకి సంబంధించిన మురుగునీరు ఏ విధంగా వెళ్లాలో గ్రామస్తులతో కూడా ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## బెస్ట్ వాలెంటరీగా ప్రశంసాపత్రం అందుకున్న అబ్దుల్ అలీం



కావలిరూరల్, డిసెంబర్ 5 **ప్రభాతవార్త** ప్రపంచ వాలెం టర్స్ డే సందర్భంగా గురు వారం నెల్లూరులోని కస్తూరిబా కళాక్షేత్రం నెహ్రూ యువకేంద్ర జిల్లా కార్యాలయంనందు జరిగిన కార్యక్రమంలో రహీం చారిటబుల్‌ట్రస్ట్ ఫౌండర్ సిఎసియల్ నెల్లూరుజిల్లా కన్వీనర్, ప్రపంచ మానవహక్కుల అవగాహనాసంఘం దక్షిణాంధ్ర రీజనల్ ఛైర్మన్ మహమ్మద్ అబ్దుల్‌అలీంకు 2023-24 యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వశాఖ, భారతప్రభుత్వం, నెహ్రూ యువకేంద్ర నెల్లూరువారిచే బెస్ట్‌వాలెంటరీ సర్వీస్ ప్రశంసాపత్రమును నెహ్రూ యువకేంద్రయూత్ ఆఫీసర్ డాక్టర్ మహేంద్రరెడ్డి, సెట్నెల్ సీఈఓ బి.శ్రీనివాసరావు, మేనేజర్ అబ్దుల్ గయాజ్ అహ్మద్ చేతులమీదుగా ప్రశంసాపత్రమును అందుకోవడం జరిగింది. అబ్దుల్‌అలీం మాట్లాడారు. చిన్నతనం నుండి తన పెద్దనాన్న చేస్తున్న సేవకార్యక్రమాలు చూస్తూ తనను ఆదర్శంగా తీసుకుని తనపేరుమీద రహీం చారిటబుల్‌ట్రస్ట్‌ను స్థాపించిఅదేబాటలో తనవంతు సేవాకార్యక్రమాలు చేస్తూ బాలకార్మికులపై మానవహక్కులపై అవగాహన కల్పిస్తూ, వి సేవాఫౌండేషన్, ప్రియదర్శిని మహి ళామండలి, గుడ్‌మ్యాన్ ట్రస్ట్‌వారితో కలిసి బ్లడ్‌వారియర్స్‌టీమ్‌గా ఏర్పడి ప్రభుత్వహాస్పిటల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగిందని తెలియచేశారు. జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా పేదలకు భోజనంప్యాకెట్లు వితరణ



కావలిరూరల్, డిసెంబర్05 ప్రభాతవార్త కావలిపట్టణ నివాసులు సంయుక్తసేవాసంస్థ ఆధ్వర్యంలో చిన్నారి సిహెచ్ శ్రీనిధి పుట్టినరోజు సందర్భంగా కావలిపట్టణ పరిసరప్రాంతమైన బుడమగుంట ఇందిరమ్మకాలనీలోని నక్కలోళ్లకు గురువారం భోజనప్యాకెట్లు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగపట్నం సురేంద్ర మాట్లాడారు. చిన్నారి సిహెచ్ శ్రీనిధి పుట్టినరోజు సందర్భంగా పేదలకు భోజనప్యాకెట్లు వితరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. సంస్థ తరపున పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేస్తున్నామని శ్రీనిధి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా భగవంతుడిని ప్రార్ధిస్తున్నామని తెలియచేశారు.

## మాలకొండలో బంగారు గొలుసు పోగొట్టుకున్న భక్తుడు

### విచారించి తిరిగి అప్పగించిన అధికారి సాగర్‌బాబు



**వలేటివారిపాలెం డిశంబరు 5, ప్రభాతవార్త** ఇటీవల మాలకొండలో దర్శి పట్టణానికి చెందిన ఓ భక్తుడు సుమారు ఒకటిన్నర సవర బంగారు గొలుసు పోగొట్టుకొన్నారు. ఆలయ డిప్యూటీ కమీషనర్ సాగర్‌బాబు తన దైన శైలిలో సీసీ పుటేజీల సహకారంతో విచారించి వారం రోజుల తరువాత బాధితునికి అప్పగించారు. దీంతో పలువురు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

**వివరాల్లోకి వెళితే..** గతనెల 23వ తేదిన దర్శిపట్టణానికి చెందిన ఓ భక్తుడు మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారికి తలనీలాల సమర్పించు నిమిత్తం మాలకొండ వచ్చారు. కేశఖండనశాలలో తలవెంట్రుకలు తీయించు నిమిత్తం చొక్కా విప్పారు. మెడలోని బంగారు గొలుసు చొక్కజేబులో పెట్టుకున్నారు. తలనీలాలు తీయించుకోవడం పూర్తియిన తదుపరి లేచి పోయేటపుడు చొక్కాజేబులోని గొలుసు కేశఖండనశాలలో జారిపడింది. ఈ విషయాన్ని అక్కడ పనిచేస్తున్న పారిశుధ్య దినసరి మహిళాకూలీ గమనించింది. ఆభరణాన్ని తీసుకొంది. ఈ విషయం తెలియని బాధితుడు గొలుసు కనపడకపోవడంతో లబోదిబోమన్నాడు. అక్కడున్న సిబ్బందిని అడిగాడు. ఎవరూ తమకు తెలియదంటే తమకు తెలియదన్నారు. తదుపరి ఆయన ఆలయ అధికారి సాగర్‌బాబుకు పిర్యాదు చేశారు. ఆయన సైతం అక్కడ ఉన్న సిబ్బందిని విచారించారు. ఆచూకి ఎవరూ చెప్పలేదు. దీంతో బాధితుడు చేసేదిలేక ఆ రోజు వెళ్లిపోయారు. తదుపరి డీసీ సాగర్‌బాబు ఈ విషయమై సీసీ పుటేజి పరిశీలించారు. స్వామివారికి సదరు భక్తుడు తలనీలాలు సమర్పించు సమయంలో మెడలోని గొలుసును చొక్కా జేబులో పెట్టుకోవడం, జేబులోని గొలుసు కేశఖండనశాలలో జారిపడడం, పారి శుధ్యసిబ్బంది ఆ గొలుసును తీసుకోవడం సీసీపుటేజిలో నిర్లిప్తమైంది. దీంతో ఆమెను అధికారి గట్టిగా మందిలించారు. తాను బంగారు గొలుసు తీసుకోలేదని, తాను తీసుకు న్నదని కేవలం పిన్నీసు మాత్రమే అని బుకాయించింది .దీంతో ఆమెపై పోలీసులకు పిర్యాదు చేయాలని నిర్ణయించారు. దీంతో ఆ మె బంగారు గొలుసును తీసుకొచ్చి ఇచ్చింది. దీంతో గత శనివారం అనగా 30వ తేదీన బాధితుని పిలిపించారు. సదరు గొలుసును బాధితునికి సాగర్‌బాబు అందచేయడం జరిగింది. దీంతో బాధితులు అధికారులుకు కృతజ్ఞతలు తెలిపారు. నిందితురాలిని విధులనుంచి సస్పెండ్ చేశారు.



## సుందరగిరివారి కండ్రిగలో అక్రమమద్యం విక్రయాలపై దాడులు



**కావలి, డిసెంబర్ 5 ప్రభాతవార్త** కావలి నియోజకవర్గంలోని బోగోలు మం డలం సుందరగిరివారి కండ్రిగ గ్రామంలో చట్టవిరుద్ధంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నవారిపై కావలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీనివాసులు పోలీ సుసిబ్బందితో గురువారం ఆకస్మికదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెను మాల మహేశ్వరివద్దనుంచి 13 మద్యంబాటిళ్లను స్వాధీనంచేసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో పిఅండ్ఈఎస్ఐ యం.దేవిక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భూసార పరీక్షా ఫలితాల విశ్లేషణ పత్రాలు పంపిణీ



**కందుకూరు, డిసెంబర్ 5, ప్రభాతవార్త** కందుకూరు మండలంలోని కోవూరు గ్రామంలో మండల వ్యవసాయాధికారి వి.రాము ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవం , ఆత్మ ఒంగోలు సౌజన్యంతో రైతులకు భూసార పరీక్షా ఫలితాల విశ్లేషణ పత్రాలను కందుకూరు సహాయ వ్యవసాయ సహాయకులు పి.అనసూయ రైతులకు పంపిణీ చేశారు. అనసూయ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రాజెక్టు ద్వారా కేంద్రీయ విద్యాలయ స్కూల్ కందుకూరు ప్రిన్సిపాల్ అర్జున్ సింగ్ స్కూల్ పిల్లల ద్వారా సోయిల్ స్కూల్ హెల్త్ ప్రోగ్రాం ప్రాజెక్టు ద్వారా మట్టి నమూనాలను సేకరించే పద్ధతి, పరీక్షించే విధానాలను ఈ ప్రోగ్రాం వలన సహకరించడం జరిగింది. అలాగే భూసార పరీక్షా ఫలితాలను బట్టి రైతులు వారి భూమిలో భూమి పోషకాలను సవరించుకోవచ్చని, పచ్చిరొట్ట పైర్లు, జీవన ఎరువులు వాడుకోవడం వలన భూసారాన్ని వృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఐ.వెంకటేష్ మాట్లాడుతూ నేలలో సేంద్రియ కర్బన శాతం పెంచుకోవడానికి పశువుల ఎరువు, వానపాముల ఎరువు, పచ్చిరొట్ట పైర్లు అయన జనుము, జీలుగ, పిల్లిపెసర వేసుకుని 40 రోజులలో పూత వచ్చేముందు నేలలో కలియ దున్నడం వలన మొక్కలకు పోషకాలు, నేల తేమ శాతం పెరుగుతుందని, జీవ శిలీంద్రాలు వృద్ధి చెంది భూమి ఆరోగ్యంగా ఉండి భూసారాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ఏవో రాము మాట్లాడుతూ ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి నేలల సంరక్షణ కొలవండి, పర్యవేక్షించండి, నిర్వహించండి అని నివాదంతో ప్రపంచ నేల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలియజేశారు. కోవూరు గ్రామంలో మొత్తం 40 మట్టినమూనాలను సేకరించి, రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్‌వ్యవసాయ లాబ్ కందుకూరు వ్యవసాయాధికారిణి వి.గీతాప్రకాష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు మయాంక్, జే.జ్యోతి, శ్రీరంగ, కేంద్రీయ విద్యాలయం సూనకల్ టీజీటీ టీచర్ కే.పృద్ధ్విరాజ్, ఆత్మ ఒంగోలు ఏటీఎం రామిరెడ్డి, కోవూరు గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.నాగరాజు, గ్రామ పెద్దలు నాదెండ్ల వెంకట రమణయ్య, ఎన్.మాధవ, రైతులు పాల్గొన్నారు.

## రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం 19.2 అడుగులు



**లింగసముద్రం, డిసెంబర్ 5, ప్రభాతవార్త** ఫంగల్ తుఫాన్ కార ణంగా గడిచిన వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాళ్లపాడు ప్రా జెక్టు నిండకుండలా తయారైంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 24 అడుగులు బుధ, గురువారాల్లో ప్రా జెక్టు ఎగువ ప్రాంతంలో అధిక వర్షాలు పడటంతో ప్రాజెక్టులోనికి వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 18.7 ఉండగా గురువారం సాయంత్రానికి పొందునిది పాయింట్‌రెండుగా నమోదైంది. గురువారం కురిసిన వర్షానికి ఎగువభాగాన ఉన్న వాగు వంకలు పొంగి పొర్లాయి. నీటిమట్టం పెరిగింది. అదే విధంగా సోమశిల ఉత్తర కాలువ మీరు కూడా ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం పెరిగే అవకా శం ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రాజెక్టు నీటిమట్టం 20 అడుగుల దాటితే ప్రాజెక్టు గేట్లు ఎత్తి మన్నేటికి నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. మన్నేరు పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఎస్.ఈ.ఐ.ఎల్. ఎనర్జీకి గ్రేట్ ప్లేస్ టూ వర్క్ కంపనీగా గుర్తింపు




**ముత్తుకూరు, డిసెంబర్ 5, ప్రభాతవార్త** భారతదేశంలో అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులలో (ఐపిపి) ఒకటి అయిన ఎస్.ఈ.ఐ.ఎల్. ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్) అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫైడ్ గుర్తింపు లభించినట్లు ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు సానుకూల, సహాయక పని వాతావరణం కల్పించడంతో పాటు ఉద్యోగుల వృద్ధికి తోడ్పాటు అందించడం వంటి అంశల్లో ఎనర్జీ యొక్క నిబద్ధతకు నిదర్శనం. కంపనీ సీఈవో రాఘవ్ త్రివేది మాట్లాడుతూ పని చేయడానికి గొప్ప ప్రదేశంగా గుర్తించబడినందుకు మేము సంతోషిస్తున్నాము. ఈ విజయం మా బృందం యొక్క అంకితభావం, కృషి, కార్యస్థల సంస్కృతిని సృష్టించే అభిరుచికి ప్రత్యక్ష ఫలితం. నమ్మకం, గౌరవం, సహకారంపై కార్యస్థల సంస్క ృతి నిర్మించబడింది. మా ఉద్యోగులు మా గొప్ప ఆస్తి అని మేము నమ్ముతున్నాం. మేము వారి వృద్ధి, శ్రేయస్సు కోసం పెట్టుబడులు కొనసా గిస్తాము, అని పేర్కొన్నారు. గ్రేట్ ప్లేస్ టు వర్క్ అనేది వర్క్‌ప్లేస్ కల్చర్‌పై గ్లోబల్ అథారిటీ. 1992 నుండి, వారు ప్రపంచ వ్యాప్తంగా 100 మిలియన్ల కంటే ఎక్కువ మంది ఉద్యోగులను సర్వే చేశారు. గొప్ప పని ప్రదేశాన్ని నిర్వచించ డానికి ఆ లోతైన విశ్లేషణలు ఉపయోగించారు. వారి ఉద్యోగుల సర్వే ప్లాట్‌ఫారమ్ నాయకులకు అభిప్రాయం, నిజసమయ రిపోర్టింగ్, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడానికి అవసరమైన విశ్లేషణలు ఇస్తుంది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫికేషన్ అనేది ఉద్యోగుల అభిప్రాయం, సర్వేలు సాంస్క ృతిక తనిఖీలతో సహా శీని।లి ఎనర్జీ వర్క్‌ప్లేస్ సంస్క ృతి యొక్క కఠినమైన అంచనాపై ఆధారపడి ఉంటుంది. ఈ గుర్తింపు ప్రపంచంలో అత్యంత గౌరవనీయమైనది. ఎస్.ఈ.ఐ.ఎల్. ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (గతంలో సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్) భారతదేశ ఇంధన భద్రతకు సహకరించడానికి కట్టుబడి ఉన్న ప్రముఖ స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారు (ఐపిపి). దేశంలో థర్మల్ పవర్ ఉత్పాదక ఆస్తులను అభివృద్ధి చేయడం మరియు నిర్వహించడంలో కంపెనీ విజయవంతమైన ట్రాక్ రికార్డ్‌ను కలిగి ఉంది. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్‌పిఎస్ నెల్లూరు జిల్లాలో 2.64జిడబ్ల్యూ సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ జనరేషన్ కాంప్లెక్స్‌ను కలిగి ఉంది. బలమైన నాయకత్వ బృందం నేతృత్వంలో శీని।లి ఈ ప్రాంతం యొక్క పురోగతిలో దీర్ఘకాలిక భాగస్వామి. ఇది ఉపఖండం అంతటా వినియోగదారులకు నమ్మకమైన స్థిరమైన విద్యుత్‌ను అందిస్తుంది. భారతదేశ ఇంధన భద్రత, అభివృద్ధి లక్ష్యాలకు మద్దతుగా ప్రభుత్వం, పరిశ్రమలతో భాగస్వామ్యం కలిగి ఉంటుంది. 4/660ఎండబ్ల్యూ కార్యాచరణ యూనిట్లతో, ఈ ప్రాంతం యొక్క ఇంధన అవసరాలను తీర్చడానికి అత్యుత్తమతరగతి పరిష్కారాలను అందిస్తోంది.

## పారిశ్రామిక ప్రగతి వైపు పరుగులు తీస్తున్న రాష్ట్రం చెంచల బాబు యాదవ్



**ఉదయగిరి, డిసెంబర్ 5, ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతి వైపు పరుగులు తీస్తుందని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచల బాబు యాదవ్ అన్నారు. గురువారం ఆయన ఉదయగిరికి వచ్చిన సందర్భంగా స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అతి తకునకవ కాలంలోనే మన రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.4,87,000 వేల కోట్ల రూపాయలు పరిశ్రమల కోసం పెట్టుబడులు తీసుకొచ్చారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు చదువుకున్న నిరుద్యోగ యువత ఇతర రాష్ట్రాలకు వలస పోతుండటం మనం చూశామని పారిశ్రామిక ప్రగతి వలన మనకు ఉపాధి లభించడమే కాక ఇతర రాష్ట్రాల వారు కూడా ఉపాధి కోసం మన రాష్ట్రానికి వచ్చే పరిస్థితులు తొందరలోనే ఏర్పడుతున్నాయని ఆయన అన్నారు. రూ.15,500 కోట్ల రూపాయలతో జనవరి నుంచి అమరావతి పనులు ప్రారంభమవుతాయని ప్రపంచంలోనే అగ్రగామి రాజధానిగా మన అమరావతిని చూడబోతున్నామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రోడ్లకు ఒక కిలోమీటర్ కు 85 లక్షల రూపాయలు చొప్పున మంజూరు చేయనున్నారని, ఈ నిధులతో రాష్ట్రంలో మట్టి రోడ్డు అనేది కనపించకుండా పోతుందని అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదాయం వైపుకు మళ్లించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదేనని కొనియాడారు. ఎన్నికలలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలోని ప్రధాన హామీలు అమలు పరిచిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఉదయగిరి అభివృద్ధి కోసం ఉదయగిరి ప్రాంతంలోని నిరుద్యోగ యువత కోసం పారిశ్రామిక వేత్తలతో చర్చలు జరుపుతున్నారని వెనుకబడిపోయిన ఉదయగిరిని అగ్రగామి నియోజకవర్గంగా మార్చేందుకు నెల్లూరు ఎంపీ వేమిరెడినడ ప్రభాకర్‌రెడినడ సహకారంతో నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన అన్నారు. అలాగే సభ్యత్వ నమోదు పట్ల ప్రతి కార్యకర్త ప్రత్యేక దృష్టి సారించి అనుకున్న దానికంటే ఎక్కువగా నమోదులు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ బయన్న, జిల్లా మైనార్టీ నాయకులు షేక్ రియాజ్, సంధాని, మాజీ కన్వీనర్ బొజ్జ నరసింహులు, అంబటి మస్తాన్ యాదవ్, కొండయ్య పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి మంచి సాంస్కృతి కార్యక్రమాలతో సంసిద్ధం కావాలి ఎంఈఓ




**ఉదయగిరి, డిసెంబర్ 5, ప్రభాతవార్త** మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి మంచి సంస్కృతిక కార్యక్రమాలతో సిద్ధం కావాలని మండల విద్యాశాఖాది. కారి-2 తోట శ్రీనివాసులు సూచించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి, ఎన్‌బీ పాఠశాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసెంబర్7వ తేదీన జరగబోవు మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశానికి సంబంధించి ఏమైనా కార్యక్రమాలు సంసిద్ధం చేశారని ఉపాధ్యాయులను అడగగా ప్రధానోపాధ్యాయులు కే.వెంకటేశ్వర్లు విద్యార్థులచే జాతీయ నాయకులు గురించి ప్రసంగాలు, కన్వర్జేషన్ నాటికలు వేయించి చూపించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను చూసిన మండల విద్యాశాఖాధికారి విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు. తదుపరి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పరిశీలిస్తూ ప్రతి రోజు మెనూ ప్రకారం రుచికరంగా భోజనం తయారు చేయగలరని నిర్వాహకులకు సూచించారు. తదుపరి పాఠశాల యొక్క అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజయాబి, నసీం అకనతర్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బొల్లినేని కుటుంబాన్ని పరామర్శించిన పలువురు నేతలు





**కలిగిరి, డిశెంబర్ 5, ప్రభాతవార్త;** తెలుగు దేశంపార్టీ సోషల్‌మీడియా కార్యకర్త బొల్లినేని సురేంద్ర గత నాలుగురోజులక్రితం మృతి విషయం తెలిసిందే .సురేంద్ర విషయం తెలుసుకున్న ఉదయగిరి మాజీ శాసనసభ్యులు, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు బొల్లినేని వెంకట రామారావు గురువారం వారి కుటుంబాన్ని స్వగ్రామమైన పెద్దపాడు చేరుకున్నారు.మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిదంగా కుటుంబ పెద్ద ఐనరాష్ట్రతెలుగురైతు కార్యనిర్వాహకఅధ్యక్షులు బొల్లినేని రామారావు కుటుంబాన్ని ఓదార్చివారికి తానెప్పుడూ తోడుంటానని తెలిపారు. మాజీ శాసన సభ్యులుతోపాటు కలిగిరి మండల మాజీ అధ్యక్షులుమెట్టుకూరి రామిరెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం రాష్ట్ర హౌసింగ్‌కార్పోరేషన్ మాజీ చైర్మన్, టిడిపి నాయకులు మెట్టుకూరి చిరంజీవిరెడ్డి రామారవు కుటుంబాన్ని పరామర్శించారు.

## నేడు పాఠశాలల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం

**కలిగిరి,డిసెంబర్5, ప్రభాతవార్త;** నేడు శుక్రవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించడం జరుగుతుందని కలిగిరి మండల అభివృద్ధి అధికారి ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు. ఈసమావేశానికి గ్రామాలలో ఉండే ప్రతి విద్యార్ధి తల్లిదండ్రులు తప్పక హాజరై తమ బిడ్డల భవిష్యత్ విషయాలను, విద్యార్ధులచదువు విషయాలను ఉపాధ్యాయులతో పంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులుకూడా విద్యార్ధుల విషయాలను తల్లిదండ్రులతో పంచుకోవడమేకాకుండాఒక పండుగ వాతావరణంలో ఈ పేరెంట్స్, టీచర్స సమావేశం నిర్వహిచాలన్నారు. జిల్లా కల్కటర్ ఆదేశాలప్రకారం ప్రతి పాఠశాలకు ఒక ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందని యంపిడిఓ తెలిపారు.

## నేటినుండి రెవెన్యూ సదస్సులు

**కలిగిరి, డిశెంబర్ 5, ప్రభాతవార్త;** నేటినుండి(6)డిశెంబర్31వ తేదీవరకు కలిగిరి మండలంలోని 23పంచాయితీలలో రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని కలిగిరి మండల తాసిల్దారు చొప్పారవీంద్రబాబుఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈసదస్సులలో గ్రామాలలోఉన్న భూసమస్యల్ని పరిష్కరించేక్రమంలో ఈ సదస్సులు ప్రాదన్యత సంతరించుకుంటాయని ఈ సదస్సులలో ప్రతిఒక్కరూ తప్పక పాల్గొని తమ సమస్యల్ని పరిష్కరించుకోవాలని మండల తాసిల్దారు తెలిపారు.కలిగిరి మండలంలో 6వ తేదీ ఉదయం9గంటలనుండితూర్పు దూబగుంట,మద్యాహ్నం2 గంటలనుండి తెల్లపాడు గ్రామంలో రెవిన్యూ సదస్సులు జరుగుతాయ న్నారు.10నకుమ్మరకొండూరు, మద్యాహ్నం క్రాకుటూరు సచివాలయంలో జరుగుతాయన్నారు.11న చిన్న అన్నలూరు, 12ననాగస ముద్రంసచి వాలయం,మద్యాహ్నం 2గంటలకు వీర్నకల్లు పంచాయితీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.17వ తేదీ కలిగిరిగ్రామ సచివాలయం,18వ తేదీ వెలగపాడు, మద్యాహ్నంకావలి ముస్తాపురంలో జరుగుతాయన్నారు.19 ఉదయం పరికోట, మద్యాహ్నంలక్ష్మీపురం సచివాలయంలో సదస్సులు జరుగుతాయన్నారు.24వతేదీశిద్దనకొండూరు,26వతేదీ గుడ్లదొన సచివాలయం 27నపెద్దఅన్నలూరు,మద్యాహ్నం వెంకనపాలెంలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.28ఉదయం రావులకొల్లు,మద్యాహ్నం పెద్దకొండూరు, 31న అనంతపురం,మద్యాహ్నం కొత్తపేట యంపిపి స్కూల్ నందు రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



**కోవూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పది పంచాయతీలకు సంబంధించి రెవెన్యూ గ్రామ సభలను శుక్రవారం నుంచి నిర్వ హిస్తున్నట్లు తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని ప్రతి పంచాయతీలో ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని, ఆయా పంచాయతీలకు సంబంధించిన రైతులు రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా ఈ సదస్సులకు అర్జీలు ఇస్తే వాటిని పరిష్కరించి అర్జీదారునికి తగు న్యాయం చేస్తామన్నారు. ఈ నెల 6వ తేదిన వేగూరు గ్రామ పంచాయతీ, 7వ తేది కోవూరు -1 సచివాలయం, 10వ తేది కోవూరు-2, 11వ తేది కోవూరు-3, 12వ తేది కోవూరు-4, 13వ తేది కోవూరు-5, 17వ తేది గంగవరం, 18వ తేది పోతిరెడ్డిపాలెం, 19వ తేది పడుగుపాడు-1, 20వ తేది పడుగుపాడు -2, 21వ తేది పడుగుపాడు-3, 24వ తేది ఇనమడుగు-1, 26వ తేది ఇనమడుగు-2, 27వ తేదిచ లేగుటంపాడు,28వ తేది మోడెగుంట, 31వ తేది చెర్లోపాలెం, జనవరి 2వ తేది పాటూరు గ్రామ పంచాయతీల్లో ఈ సదస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్కే నాజర్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రవి, ఆర్ఐ రాకేష్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, సుధా, మండలంలోని అన్ని గ్రామాల గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## గ్రామ సర్పంచ్ చొరవ.. పూడిన మురుగు కాలువలకు మోక్షం





**కోవూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త :** గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధిపథంలో పయనిం చాలంటే సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచ్ పాలకవర్గాలు ప్రత్యేకంగా దృష్టి సారిస్తే ఈ కల సాకారం అవుతుంది. ఈ దిశగా కోవూరు మండలం లేగుంటపాడు గ్రామ సర్పంచ్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి అడుగులు వేస్తూ ఇటు ప్రజాప్రతిని ధులు, అటు అధికారుల మన్ననలు పొందుతు న్నారు. గత సంవత్స రాల తరబడి ఈ పంచాయతీ పరిధిలో ఉన్న మురుగునీటి కాలువలు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ఫలితంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ కాలువల గుండా నీరు ప్రవహించే పరిస్థితి లేక పొలాలపై వెళ్లే పరిస్థితి ఏర్ప డింది. దీంతో ఈ విషయాన్ని గమనించిన గ్రామ సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి కొన్ని ప్రాంతాల్లో జేసీబీని ఏర్పాటు చేసి మురుగు కాలువలకు మోక్షం కలిగించగా.. కొన్ని ప్రాంతాల్లో కూలీలను ఏర్పాటు చేసి కాలువల్లో పూడిన మట్టిని తీయిం చారు. ఈ ప్రక్రియతో మురుగు కాలువలు మోక్షం వచ్చి పొలాల్లో ఉన్న వర్షపు నీరు ఈ కాలువల గుండా బయటకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆ ప్రాంత రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## సాంఘిక సంక్షేమ వసతి గృహాల పై దృష్టి సారించండి



**బిట్రగుంట,డిసెంబర్ 5,ప్రభాతవార్త:** జిల్లాలోని దుస్థితిలో ఉన్న,శిధిలావస్థలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాలు గురించి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా దళిత సంఘర్షణ సమితి అధ్యక్షుడు శెట్టిపల్లి మల్లి డిమాండ్ చేశారు.మండల కేంద్రమైన బోగోలు లో ప్రభాతవార్తతో ఆయన గురువారం మాట్లాడారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ హాస్టల్స్ 75 ఉంటే అందులో 50 వరకు శివిలావస్థలో ఉన్నాయన్నారు.కిటికీలు,ఫ్యాన్‌లు,తలుపులు సక్రమంగా లేక ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలతోటీ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.గత ప్రభుత్వం 5 సంవత్సరాలు సాంఘిక సంక్షేమ వసతి గృహాలను నిర్లక్ష్యం చేసారని చెప్పారు.ఇప్పుడు ప్రభుత్వం కూడా అదే దారిలో ఉందని తెలిపారు.ఈ విధంగా ఉండటం వలన విద్యార్థులు చదువుకోవడానికి ఇష్టపడం లేదన్నారు.హాస్టల్స్ సౌకర్యాలు లేక,సిబ్బంది సక్రమంగా పట్టించుకోకపోవడంతో సంక్షేమ హాస్టల్స్ సంక్షోభంలో ఉన్నాయన్నారు.బాలికల హాస్టల్స్ ఎత్తివేసారన్నారు.డబ్బు ఉన్నవారు రెడిడెన్షియల్స్ లో చదువుకుంటున్నారని తెలిపారు.డబ్బు లేని వారు ఇంటికి పోతున్నారని తెలిపారు.దీనివల్ల ఆడపిల్లలు ప్రభుత్వాలు విద్యకు దూరం చేసాయని ఆరోపించారు.జిల్లా లో 50 హాస్టల్స్ లో కరెంట్ వైర్లు సక్రమంగా విద్యుత్ షాక్ లు కొడుతున్నాయన్నారు.కాబట్టి తక్షణమే హాస్టల్స్ మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు.ఫ్యాన్లు,కిటికీలు,విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.పలుమార్లు జిల్లాలో సోమవారం జరిగే గ్రీవినెన్స్‌డేలో కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లినా ఫలితం కనపబలేదు అని ఆవేదన వ్యక్తం చేసారు.ఇకనైనా అధికారులు స్పందించకపోతే ఆందోళన కు పూనుకొంటామని హెచ్చరించారు.

## కొండ్రెడ్డి రంగారెడ్డి తండ్రి వర్ధంతి



**అల్లూరు,డిసెంబర్ 5,ప్రభాతవార్త:** అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని నార్త్ మోపూరులో కొండ్రెడ్డి రంగారెడ్డి నివాసంలో ఆయన తండ్రి దశరథ రామి రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు ముందుగా దశరథ రామిరెడ్డి చిత్రపటానికి ఆయన కుమారుడు నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొని దశరథ రామి రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

## జలదిగ్బంధంలో బేతనియపేట



**బిట్రగుంట,డిసెంబర్ 5,ప్రభాతవార్త:**బోగోలు మేజర్ పంచాయతీలోని బేతనియపేట తరచూ భారీ వర్షాలకు ముంపుకు గురవుతోంది.గత రెండు రోజులుగా భారీ వర్షాలు మండలంలో కురుస్తుండడంతో సమీపంలోని రైల్వే శాఖ అధీనంలో ఉన్న సీతమ్మ చెరువు ప్రాంతంలో వర్షపు నీరు చేరడంతో ఆ ప్రవాహమంతా పల్లపు ప్రాంతమైన బేతనిపేటలోకి ప్రవేశించి జలద్బంధనంలో చిక్కుకుపోతుంది.ప్రతి ఏడాది ఇదే పరిస్థితి తో ఈ ప్రాంత వాసులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు.దీనికి పంచాయతీ వారు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఈ ప్రాంతమంతా జలదిగ్బంధంలో చిక్కుకోకుండా చూడాలంటే రైల్వే పరిధిలో ఉన్న సీతమ్మ చెరువు వద్ద పంచాయతీ వారు అడ్డుకట్ట నిర్మాణం చేపడితే పల్లపు ప్రాంతమైన బేతనియపేట లోకి వర్షపు నీరు రాకుండా అరికట్టవచ్చు కావున అధికారులు స్పందించి శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సీతారామపురం మండలంలో ని గ్రామాలకు రాకపోకలు బందు



సీతారామపురం డిసెంబర్ 5 ప్రభాతవార్త మండలంలో కొద్ది రోజులుగా ఎడతెరపలేకుండా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాలలో నీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని చిన్న నాగంపల్లి,పబ్బులేటిపల్లి, బోడసిద్దాయపల్లి, రంగనాయుడు పల్లి, పోలంగారిపల్లి దేవమ్మ చెరువు,గంగవరం గ్రామాల సమీపంలోని వాగులు పొంగి పొర్లడంతో వర్షపునీరు రోడ్డుపైకి రావడంతో ఆప్రదేశం వద్ద వాహనాలు నిలిచిపోయాయి.రంగనాయుడుపల్లి వద్ద మర్రి ఒడల చెరువు నిండి వాగు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో ఉదయగిరి నుండి సీతారామపురం వచ్చే వాహనాలు నిలిచిపోయాయి. అదే విధంగా ఒగూరువాండ్ల పల్లి వద్ద పిల్లాపేరు వాగు ఉదృతంగా ప్రవహించడంతో సిఎస్‌పురం నుండి సీతారామపురం వచ్చే వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. అదే విధంగా పోరుమామిళ్ళ నుండి వచ్చే వాహనాలు కూడా అక్కడే నిలిచిపోయాయి. వాగు ఉదృతి తగ్గుముఖం పట్టేవరకు ప్రయాణికులు వేచి చూడాల్సి న పరిస్థితి ఏర్పడింది.పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు,ఉద్యోగులు ,సచివాలయ సిబ్బంది సైతం వెళ్ళలేక వెనుతిరిగిన పరిస్థితి నెలకొంది.

## సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్న రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికల పోలింగ్





బిట్రగుంట,డిసెంబర్ 5,ప్రభాతవార్త: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట లో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న వన్ నేషన్ వన్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్నాయి.ఈ నెల 4 నుండి 6వ తేదీ వరకు ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు.వివిధ డిపార్టుమెంటులో పనిచేసే ఉద్యోగుల సౌలభ్యం కోసం మూడు రోజులపాటు వారు యూనియన్ ను ఎన్నుకునేలా ఓటు వేసేందుకు సౌకర్యాన్ని కల్పించారు.రైల్వే మజ్దూర్ యూనియన్,రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ పోటాపోటీగా శిబిరాలు ఏర్పాటు చేసి ఓటు వేసే ఉద్యోగిని ఆకర్షించేలా వారి వారి యూనియన్లను బలపరచాలని కోరుతున్నారు.పోటాపోటీగా యూనియన్ గుర్తింపు ఎన్నికలు జరుగుతుండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్ పి ఎఫ్ ఎస్ ఐ మహేంద్ర,జి ఆర్ పి ఎస్ ఐ రమాదేవి,బిట్రగుంట ఎస్సై భోజ్యా అన్ని చర్యలు తీసుకున్నారు.ఈ ఎన్నికల్లో ఆయా యూనియన్లను బలపంచాలంటూ డివిజనల్ కార్మిక సంఘాల నేతలు కూడా విస్త ృతంగా ప్రచారం నిర్వహించారు.

## రెవెన్యూ సదస్సులు

**ఉలవపాడు, డిసెంబర్ 5, ప్రభాతవార్త** గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6వ తేదీ నుండి 21వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహశీల్దార్ వి.లావణ్య గురువారం తెలిపారు. 6వ తేదీ బద్దిపూడి, 10న ఉలవపాడు, 11 భీమవరం, 12 రామయపట్నం, 13 కరేడు గ్రామాల్లో ఉదయం 10గంటల నుంచి 5గంటల వరకు, 17 ఆత్మకూరు ఉదయం 10 నుంచి 1గంటల వరకు, మన్నేటికోట-2నుంచి 5గంటల వరకు, 18- వీరేపల్లి ఉదయం 10గంటల నుంచి 1 గంటల వరకు, దాగొల్లు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు, 19-కృష్ణాపురం ఉదయం 10 నుంచి 1 గంటల వరకు, 21 చాకిచర్ల ఉదయం 9గంటల నుండి 1 గంటల వరకు, పెద్దపుట్టపుపాలెం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రైతులు ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## శివాలయంలో అయ్యప్ప స్వామి పడిపూజ



**దగదర్తి, డిసెంబర్5, ప్రభాతవార్త** దగదర్తి శివాలయంలో అయ్యప్ప స్వామి పడిపూజ జరిగింది. ఈ పూజకి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బా నాయుడు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొని పడిపూజని ఎంతో కనుల విందుగా వైభవంగా జరిపారు. పూజ అయిన తర్వాత స్వామి ప్రసాదం సేవించారు.

## మన్నేరు పరివాహక ప్రాంత ప్రజలకు ఎమ్మెల్యే సూచన



**కందుకూరు, డిసెంబర్ 5, ప్రభాతవార్త** కందుకూరు నియోజకవర్గం లింగస ము ద్రం మండలం రాళ్ల పాడు ప్రాజెక్టుకు ప్రస్తుతం 19 అడుగుల మేర నీరు చేరింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు నీటిమట్టం పెరిగి అధికారులు నీరు కిం దకు విడు దల చేసే అవకాశం ఉంది. కావున ప్రజలు, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే తెలియజేశారు. మన్నేరు వాగు ప్రవ హించే ఇరు వైపులా ఉండే గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండా లని, రాత్రిపూట మన్నేరు ప్రవాహ ప్రాంతాలకు ఎవరువెళ్లరాదని,మన్నేరు ప్రవహించే బ్రిడ్జిలుదాటే ప్రయ త్నం చేయరాదని, ప్రజలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు.

## పచ్చళ్ళ తయారీలో మహిళల శిక్షణ



**ముత్తుకూరు, డిసెంబర్ 5, ప్రభాతవార్త** కృష్ణపట్నం గ్రామాల మహిళా సంఘా లకు అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్, అదానీ ఫౌండేషన్, కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, పోలేరమ్మతల్లి మహిళా సంఘం, తిరుమలేశ్ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో గురువారం మసాలా ప్యాకేజింగ్, మార్కెటింగ్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిక్షణ మహిళలకు తయారీ మార్కెటింగ్ నైపుణ్యాలను అందించడంపై దృష్టి సారించడంతో పాటు, ఆర్థిక స్వావలంబనకు కృషి చేయడం జరిగింది. ఈ శిక్షణ మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో ఆర్థిక అవకాశాలను అన్వేషించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అలా నీ ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్ తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు శిక్షణ పట్ల ఆనందాన్ని వ్యక్తం చేయడంతో పాటు, ఇది వారి రోజువారీ జీవితాల్లో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారతను ప్రోత్సహించడంలో అదానీ ఫౌండేషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ వేణుగోపాల్ అదానీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ హెడ్ కళ్యాణ్ కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీఈఓ వెంకటేశ్, కేపీఎఫ్‌సీఎల్ ట్రెజరర్ షేక్ షఫీ, చలివేంద్రం వార్డు సభ్యులు వెంకటేశ్, రామనగర్ పెద్దకాపు వెంకట రమణయ్య, అదానీ ఫౌండేషన్ హెచ్ఓడీ రాజేష్ రంజన్, డా. రమేష్ బాబు , అదానీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ మురళి, షేక్ షాహుల్ హమీద్ టీ.అరుణ్ పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో డిజి యాత్రఅందుబాటులో ఉన్న విమానాశ్రయాలేవి?



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డిజి యాత్రసేవలు అమలులో ఉన్న విమానాశ్రయాల వివరాలు తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో ప్రశ్నిం చారు. రాష్ట్రాల వారీగా, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్లో గత ఐదేళ్లలో డిజి యాత్ర సేవలకు నమోదు చేసుకున్న ప్రయాణ కుల సంఖ్య ఎంతని, ఈ సంఖ్యను పెంచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజేయాలని గురువారం కోరారు. డిజి యాత్రలో నమోద వు తున్న ప్రయాణీకుల డేటాను భద్రంగా ఉంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుం టున్నారో వివరించాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహుల్ సమాధానమిచ్చారు. ప్రస్తుతం డిజి యాత్ర ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడు, విశాఖ పట్నం విమానాశ్రయాల్లో అందుబాటులో ఉందని సమాధానమిచ్చారు. దేశంలోని 24 విమానాశ్రయాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సేవలను దశలవారీగా అన్ని విమానాశ్రయాలలో ప్రవేశపెట్టేందుకు ప్రయ త్నిస్తున్నామన్నారు. డిజి యాత్ర సేవలు డిసెంబర్ 2022 లో ప్రారం భించినప్పటి నుంచి ఇప్పటివరకు 80 లక్షల మంది ప్రయాణికులు నమోదు చేసుకున్నారని మంత్రి సమాధానమిచ్చారు. ప్రయాణీకుల వ్యక్తిగత సమాచా రానికి ఎలాంటి ఇబ్బంది లేదని, వారి డేటా సేవ్ చేయబడదని వివరించారు. పరిమిత సమయం వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని, విమానం బయలుదేరిన 24 గంటల తర్వాత సిస్టమ్ నుండి డేటా తొలగించబడుతుందని వివరించారు. డిజి యాత్ర సేవలు వినియోగదార మొబైల్ ఫోన్లో అందుబాటులో ఉంటాయన్నారు. డిజి యాత్రసేవలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు, ఎయిర్పోర్ట్ ఆపరేటర్లు , ఎయిర్లైన్ ఆపరేటర్లు విమానంలో ప్రకటనలు చేయడం, హెల్ప్ డెస్క్ సపోర్ట్ అందించడం, విమానాశ్రయాలలో బ్యానర్స్, వీడియోలు మొదలైన వాటిని ప్రదర్శిస్తున్నారన్నారు.

## మద్యం షాపు కావాలంటూ రోడెక్కిన మహిళలు



ఉదయగిరి, డిసెంబర్ 5, ప్రభాతవార్త ఉదయగిరి మండలం గండిపాలెంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయాలని పలువురు మహిళలు ఆందోళన దిగారు. గ్రామంలో ఓ పార్టీకి చెందిన మహిళలు రెండు వర్గాలు విడిపోయారు. వారి ఆదిపత్యాన్ని నెగ్గించుకోవడం కోసం ఒకర మద్యం షాపు కావాలని, మరొకరు వద్దంటూ ఆందోళన చేపట్టారు. ఇదేమి విడ్డూరమంటూ పలువురు మహిళలు గండిపాలెం గ్రామంలో ఐదు బెల్టుదుకాణాలు ఉన్నాయి. అవి రద్దు పరిచి ఒక బారు షాపు మాత్రమే గండిపాలెంలో నిర్వహించాలని మహిళలు కోరారు. అలాగే కొంత మంది ఇదేమి విడ్డూరమని మండిపడుతున్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగపరచుకోండి : ఎమ్మెల్యే



**వింజమూరు,డిసెంబర్5,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ సభల్లో పాల్గొని ప్రజల భూ సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి కృషి చేయాలన్నారు. పాస్‌బుక్‌లు, అడంగల్ కరెక్షన్, సర్వే హద్దులు , ఖాతా నెంబర్లు, దారుల ఆక్రమణ, భూ ఆక్రమణలు తదితర అనేక సమస్యలను ప్రభుత్వ రికార్డులను అనుసరించి ప్రజలకు న్యాయం చేసేలా తెలుగుదేశం పార్టీ నేతలు చూడాలని ఆయన కోరారు.

## పోలంరెడ్డి దినేష్ రెడ్డి నెల్లూరు రాక



**నెల్లూరు, డిసెంబర్ 5, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించి మొట్టమొదటిసారిగా కోవురూ నియోజకవర్గకి విచ్చేసిన పోలంరెడ్డి దినేష్ రెడ్డి గారిని బుచ్చిరెడ్డిపాలెంలోని తెలుగుదేశం మైనార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఘన సన్మానం చేసినారు ఈ కార్యక్రమంలో షేక్ యస్దని భాష, జఫరుద్దీన్,ఫిరోజ్ అహ్మద్ ,షాకీర్ సలాం, గయాజ్ మధు సుభాన్ మొదలైన వారు పాల్గొన్నారు.

## వేణుగోపాల్ కు ఉత్తమ వాలంటరీ సర్వీసు ప్రశంసాపత్రం అందజేత



**నెల్లూరు,డిసెంబరు5 ప్రభాతవార్త-విద్య** ప్రపంచ వాలంటీర్స్ డేను పురస్క రించుకుని నెహ్రూయువకేంద్ర, సెట్నెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉత్తమ సేవా ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ సేవలను అందించినందుకు గానూ పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్.వేణుగోపాల్‌కు ఉత్తమ వాలంటరీ సేవా ప్రశంసా ప్రతంను జిల్లా యూత్ అధికారి మహేందర్‌రెడ్డి, సెట్నెల్ సిఈఓ శ్రీనివాసరావులు అందజేశారు. 2023,2024లో పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, ర్యాలీలు, అవగాహన సదస్సులు , మై బారత్ పోర్టల్, అమ్మపేరుతో మొక్కలు నాటడం వంటి వాటిని సమర్ధవంతంగా నిర్వహించటం జరిగిందన్నారు. తమకు ఉత్తమ ప్రశంసా పత్రం రావడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో రసూల్, వెంకటేశ్వర్లు, ప్రయదర్శిని, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశం విజయవంతం చేయాలి



**కోవూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 7వ తేది శనివారం నిర్వహించనున్న మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశం విజయవంతం చేసేలా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి తెలిపారు. కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో గురువారం మండలంలోని అన్ని పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశంకు విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ హాజరయ్యేలా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులను, ప్రజాప్రతినిధులను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఈ సమావేశాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలన్నారు. ఈ విధమైన సమావేశాల వలన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలల మధ్య సంబంధాలు మరింత బలపడతాయన్నారు. అదేవిధంగా ఈ సమావేశాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం విద్యార్థుల తల్లిదండ్రులకు వేరువేరుగా ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు కూడా అందజేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు ఈ సమావేశంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలానంద బాబా, ఎంఈవోలు రహీమ్, చెంచులక్ష్మమ్మలు పలు సూచనలు చేశారు.

## కొండాయపాలెం అంగన్‌వాడీ సెంటర్ నందు ఈసీసీ డే కార్యక్రమం



**ఉదయగిరి, డిసెంబర్ 5, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని కొండాయపాలెం అంగన్‌వాడీ సెంటర్ నందు ఈసీసీడే దినోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్త జయలక్ష్మీ మాట్లాడుతూ ఈసీసీడే అంటే అంగన్‌వాడీ లో ప్రారంభ దశ పిల్లల విద్య ఆమె పిల్లలకు శారీరక మానసిక సామాజిక అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా పిల్లలకు సహజమైన అహ్లాదకరమైన ఉత్తేజకరమైన వాతావరణాన్ని అందిస్తారని అన్నారు. పిల్లల అభివృద్ధికి అన్ని అవసరమైన అంశాలను అందిస్తారు అంగన్‌వాడీ కేంద్రాలు భారత ప్రభుత్వం ప్రారంభించిన ఒక ప్రధాన పథకం పిల్లలకు గర్భవతులకు పాలిచ్చే తల్లులకు సంరక్షణ అందించడం వారికి రక్తహీనత లేకుండా అంగన్‌వాడీలో సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. పిల్లల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే రెండు రోజులు ప్రజలెవరూ పెన్నా నదిలోకి వెళ్ళవద్దు



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 5, ప్రభాతవార్త** సోమశిల ప్రాజెక్టు నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, ప్రస్తుతానికి ఎటువంటి ప్రమాదం లేదన్నారు. అయితే పెన్నా నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాబోయే 48 గంటల వరకు పెన్నా పరిసర ప్రాంతాల ప్రజలు నదిలోకి దిగవద్దని సూచించారు. జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పెట్టాయని, పై నుండి వచ్చే ఇన్ఫ్లో లపై ఆధారపడి నీటి విడుదల ఉంటుందన్నారు. ఇటీవలి వర్షాలకు జిల్లాలో సుమారుగా రెండు వేల ఎకరాల్లో నీళ్లు నిలిచాయని వాటిని తొలగించే కార్యక్రమం చేపట్టామన్నారు.నీరు పోయిన తరువాత నష్టం అంచనాలు తెలుస్తాయన్నారు. నార్లు పోసి నష్టపోతే విత్తనాలు ఇస్తామన్నారు. ఈ పాత్రికేయ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్. బాలాజీ రావు పాల్గొన్నారు.

## నారాయణపురంలో అక్రమ మద్యం పట్టుకున్న ఎస్ఐ



**దగదర్తి, డిసెంబర్ 5, ప్రభాతవార్త :** దగదర్తి పోలీస్ స్టేషన్ కి వచ్చిన సమాచారం మేరకు నారాయణపురంలో ఎస్సై జంపని కుమారు సిబ్బందితో దాడులు నిర్వహించగా నారాయణపురంలో ఒక వ్యక్తి దగ్గర 16 క్లాసిక్ వి ఎస్ ఓ పి రెడ్ 180 ఎం.ఎల్ రెడ్ బాటిల్స్ పట్టుకున్నారు కేసు నమోదు చేసినారు ఎస్సై జంపన్ కుమార్ మాట్లాడుతూ దగదర్తి మండలంలో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే ఊరుకునేది లేదని సీరియస్ గా వార్నింగ్ ఇచ్చినారు

## 50 శాతం సబ్సిడీతో షేడ్‌నెట్, పాలిహౌస్‌ల నిర్మాణం



**సంగం డిసెంబర్ 5 ప్రభాతవార్త** రక్షిత వ్యవసాయ పథకం కింద షేడ్ నెట్ ,పాలిహౌస్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.రైతులకు వ్యక్తిగతంగా షేడ్‌నెట్ హౌస్ నిర్మాణానికి ఎకరాకి 28.4 లక్షలు పాలిహౌస్ నిర్మాణానికి 37.4 లక్షలు ఖర్చు అవుతుండగా 50 శాతం రాయితీ ఉద్యాన శాఖ ద్వారా ఇవ్వడం జరుగుతుందని ఉద్యాన వనాధికారి పి లక్ష్మీ తెలియజేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలనిన ఆమె కోరారు.

## దళితుడైన ప్రొఫెసర్ చంగయ్యపై బజరంగ్ దళ్ గుండాల దాడికి నిరసన




**కందుకూరు, డిసెంబర్ 5, ప్రభాతవార్త** తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న ప్రొఫెసర్ చంగయ్యపై బజరంగ్ దళ్ గుండాలు దాడి చేయడాన్ని పీడీఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎల్.రాజశేఖర్, ఐఎఫ్‌టీయురాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఆర్.మోహన్ తీవ్రంగా ఖండించారు. ప్రొఫెసర్ చంగయ్యపై దాడి చేసిన బజరంగ్ దళ్ గుండాలను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కందుకూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద పీడీఎస్‌యు, ఐఎఫ్‌టీయు కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ చంగయ్యపై బజరంగ్ దళ్ గుండాలు దాడిని నిరసిస్తూ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ అగ్రకుల ఫ్యాక్షనిజం కొనసాగుతున్న రాయలసీమ ప్రాంతంలో హిందూ ఫాసిస్ట్ శక్తులు విస్తరించి దళితులపై దాడులకు తెగబడుతున్నారని, అందులో భాగంగానే ఎస్‌వి యూనివరిసటీలో ప్రొఫెసర్ చంగయ్యపై దాడి అని ఆవేదన వ్యక్తం చేశారు. కామ్రేడ్ ఆర్.మోహన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో విస్తరిస్తున్న మనువాద ఫాసిస్టు విస్తరణ ఇది హెచ్చరిక అని అన్నారు. కూటమి ప్రభుత్వం హిందు ఫాస్టిస్ట్ సనాత ధర్మాలను విస్తరణకు తోడ్పడుతుందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన ధర్మమే భారతీయ ధర్మమని ప్రచారం చేయడం అత్యంత దుర్మార్గం అన్నారు. అందువలన దళిత, ప్రజాస్వామ్యం ప్రజా సంఘాల కమ్యూనిస్టు విప్లవ శక్తులు ఐక్యంగా మనువాద హిందూ మతోన్మాద గుండాల దాడులను ప్రతి ఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.కోటేశ్వరరావు, ముప్పవరపు కిషోర్, ప్రభాకర్, అయ్యన్న, జనార్ధన్, బాలసుబ్రహ్మం, శ్రీనివాస్, పీడీఎస్‌యు పట్టణ నాయకులు మనోహర్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి : తహశీల్దార్



**ఉదయగిరి, డిసెంబర్ 5, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉదయగిరి తహశీల్దార్ ఎం.సుభద్ర తెలిపారు. గురువారం ఉదయం మండలంలోని శకునాలపల్లి సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూములలో మార్పులు చేర్పులు అలాగే సరిహద్దులు సమస్యలుంటే తెలియజేయాలన్నారు. రీ సర్వేలో ఏమైనా పొరపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## మండలంలో విచ్చలవిడిగా మద్యంబెల్టుషాపులు

## మామూళ్ల మత్తులో ఎక్సైజు అధికారులు



**వలేటివారిపాలెం డిశంబరు 5, ప్రభాతవార్త** వలేటివారిపాలెం మండలంలో మద్యం ఏరులై పారుతుంది.ప్రతి గ్రామంలో బెల్టుషాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయి.మందుబాబులు మద్యం మత్తులో మనిగితేలుతుండగా ఎక్సైజ్ అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో ఉన్నారు.కూలీనాలీచేసుకునే పేదజనం మద్యానికి బానిసై కుటంబాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో పేద సాద కూలీనాలీ కుటుంబాలలో మహిళలు మాత్రం అల్లాడుతున్నారు.గ్రామాల్లో బంకుల్లోనూ, కిరాణాషాపుల్లోను బహిరంగంగా విక్రయిస్తున్నారు.పైగా అధిక రేట్లుకు విక్రయి సున్నారు. జనావాస కూడళ్లలో మందుబాబులు ఆగడాలకు అడ్డూఆపూలేదు. తాగి ఊగుతూ తందనాలు ఆడుతుంటారు.వంటిమీద వస్త్రాలు ఉండవు. అసహ్య ప్రవర్తనతో జనంలో తిరగడం ప్రయాణికులుకు ఇబ్బందిగా ఉంది.బెల్టుషాపులు నిర్వహించరాదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశిస్తున్నారు. బెల్టుషాపులను ప్రోతహించినా, సహకరించినా సదరు లైసెన్సులను రద్దుచేస్తామని హెచ్చరిస్తున్నారు.బారీ జరిమానా విధిస్తామని చెప్తున్నారు.ఈ విషయమై అప్రమత్తమవ్వాలని ఎక్సైజ్ అధికారులుకు ఉత్తరువులును జారీచేశారు.అయినా ఆచరణలో అవేమి పని చేయడం లేదు.మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు మునిగి తేలుతున్నారు.ప్రతి గ్రామంలో 4,5షాపులుకి పైగా ఉన్నాయి.ఒక్క అయ్యవారిపల్లెలోనే 16షాపులు నడుస్తున్నాయి.అదే విధంగా పోలినేనిచెరువు, గరుగుపాలెం, చుండి, అమ్మపాలెం, బంగరక్కపాలెం, కొండసముద్రం, కూనిపాలెం, శాఖవరం, శింగమనేనిపల్లె, నలదలపూరు, చెర్లోపాలెం తదితర గ్రామాల్లో బెల్టుషాపుల జోరుహోరుగా సాగుతుంది. ఇకపోతే అంకభూపాలపురం,కట్టెమ్మపాలెం తదితర గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణను గ్రామస్తులే బహిరంగవేలాం వేసి నిర్వహిస్తున్నారు.ఉదయం నుంచి రాత్రి వరకు ఏనీటైం మద్యం అన్న చందానా అందుబాటులో ఉంది. ఒక్కోక్క బాటిల్‌పై రూ.20 నుంచి 30వరకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ధరలు తగ్గించినా ప్రయోజనం లేదు.ఎమ్మార్పీ రేట్లా అవెక్కడ అన్నచందంగా ఇక్కడ పరిస్థితి ఉంది. అధికధరలు వసూలు చేస్తూ మందుబాబులను మత్తులో చిత్తుచేస్తున్నారు.

## ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని అభినందించిన సన్నపరెడ్డి సోదరులు



**కోవూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యే తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు అయిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని.. జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ సన్నపరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి సన్నపరెడ్డి రవిప్రసాద్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం శాలువాతో ప్రత్యేకంగా సన్మానించారు.

## తీరప్రాంత మత్స్యకార గిరిజనులకు అండగా ఉంటాం



**కోవూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త :** సుదీర్ఘ తీర ప్రాంతంలో ఉన్న గిరిజనులు మత్స్యకారులకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిరువురిని ఏఆర్‌డీ సంస్థ వారు ప్రత్యేకంగా భారీ పూలమాల శాలువాతో ఘన సత్కారం చేశారు.

## మన్నేటిని తల్లిదండ్రుల విస్తృతస్థాయి సమావేశానికి ఆహ్వానం పలికిన టీచర్లు



**ఉదయగిరి, డిసెంబర్ 5, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని అప్పసముద్రం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈనెల 7వ తేదీ జరుగుతున్నటువంటి తల్లిదండ్రుల విస్తృతస్థాయి సమావేశానికి రావాలని మన్నేటి వెంకటరెడ్డిని అప్పసముద్రం ప్రధానోపాధ్యాయులు ఆహ్వానం పలికారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ తప్పకుండా సూనకల్ కమిటీ అధ్యక్షులతో కలిసి ఘనంగా హాజరవుతానని పాఠశాల ప్రగతికి తన వంతు కృషి ఎల్లవేళలా కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.విజయ్ కుమార్, సహాపధ్యాయులు ఆర్.దుర్గ ప్రసాద్, విద్యాకమిటీ అధ్యక్షులు వి.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.